
# తెల్లకాకి



ఆ రోజు నారాయణ నిద్రలేస్తూనే యధావిధంగా కాకమ్మ మొగం చూశాడు!

నిద్రలేస్తూనే కాకి మొగం చూస్తే ఆ దినమంతా కాగల కార్యాల్ని గంధర్వులే నిర్వహిస్తారని నారాయణ నమ్మకం. అది సటపటమైనది కాదు. దాదాపు రెండు దశాబ్దాలకు పైబడి రెండేళ్ళుగా గుండెల్లో నాటుకొన్న నమ్మకం!

నారాయణ జీవితం రెండు దశాబ్దాలకు మునుపు మలి దశాబ్దంలో అడుగు పెడ్తున్న తొలి రోజుల్లో ఆఖరి ఆశ్వాసంలో ఉన్న అవ్వమ్మ మనవణ్ణి చేరదీసి చెక్కిళ్ళు నిమురుతూ చెవులో ఇల్లు గట్టుకొని చెప్పింది కాకమ్మను గురించి! అప్పుడు నారాయణ అవ్వమ్మ చెప్పిన కాకమ్మ కథను ఊకుడుకథ విన్నట్లుగా కండ్లు ఇంతింతలుచేసి శ్రద్ధగా విన్నాడు. ఆపై కండ్లు చికిలించి ఆలోచించాడు. ఆ ఆలోచన ఫలితంగా అవ్వకు పరీక్ష పెట్టాలనుకొన్నాడు. ఆ మరుసటి రోజు నిద్రలేచీ లేవడంతోటే ఇంటిముందర చింత చెట్టుమీద 'కార్ కార్' మని అరుస్తున్న కాకమ్మ మొగం చూశాడు.

కాకమ్మ మొగం చూశామన్న ధైర్యంతో నారాయణ దినపత్రిక మొగంలో తలదూర్చిన తండ్రి మొగాన్ని ధీమాగా చూస్తూ 'అయ్యా! అయ్యా! ఊళ్ళోకి కొత్త సినిమా వచ్చిందయ్యా! నా స్నేహితులందరూ ఫస్ట్ షో చూడాలంటున్నారు!' అన్నాడు.

"ఊఁ! ఫస్ట్ డే!.... ఫస్ట్ షో!! సెభాష్!.. వెధవలెవ్వరో పోతే నువ్వూ పోవాలా నాయనా!- బుద్ధుందానీకు? నిద్రలేచీ లేవడంతోటే ఇదేనా పాట? ఒళ్ళెట్లుందిరా పిల్ల వెధవా?... వెళ్ళు వెళ్ళు. వెళ్ళి... చదువుకో!" అని మాటల్లో వదిలిపెట్టకుండా వీపు సాపు చేసే మనిషి మారు మాట్లాడకుండా అయిదు రూపాయల కొత్తనోటు చేతికిచ్చేసరికి నారాయణ ఎగిరి గంతేశాడు.

అమాంతంగా ఎగిరి చెట్టు మీది కాకమ్మ కంటే ఆ కాకమ్మను గురించి ఏకరువు పెట్టిన అవ్వమ్మకు పాదనమస్కారం చేయాలనుకొన్నాడు. అయితే మనసు ఊసరవెల్లిలా వెనక్కు ముందుకు ఊగిసలాడింది. ఒక్కటి జరగడం కాకతాళీయం కావచ్చు. ఒకటి రెండు వనరంగ మూడు. అప్పుడు ఆలోచించవచ్చులే! అనుకొని తన ఆలోచనకు వాయిదా వేసుకొన్నాడు నారాయణ! ఆ తరువాత రెండో ప్రయత్నానికి అడుగు ముందుకు వేశాడు.

ఒక్క ఊపులో వంటింట్లో జొరబడ్డాడు. పాచి పనుల్తో సతమతమవుతున్న తల్లి ఎదుట నిలబడ్డాడు. నిద్ర కళ్ళల్లో పొంగి పొరలుతున్న ఆనందాన్ని ఆ తల్లి ఆశ్చర్యంగా చూస్తుంటే- "మా అమ్మ!... బంగారుకొండ!" అన్నాడామె చెంపల్ని నిమురుతూ!

"అవున్నాయినా! అవును. మీ అమ్మ బంగారుకొండ. ఎంత అరగదీసినా అరగలేదు. ఎలా కరగదీసినా కరగలేదు. అందుకని ఇద్దో ఈ పాత్రల్ని ఇలా తోఁవి తోఁవి కరగదీస్తున్నా!... అది సరేకానీ అసలు సంగతి చెప్పుబిడ్డా!"

"అమ్మా! ఫస్ట్‌డే! ఫస్ట్‌షోకు పోవాలంటే మా అయ్య మారుమాట్లాడకుండా అయిదు రూపాయలు ఇచ్చేశాడు. కాకమ్మ మొగం చూశాను కదా? ఈపూట పరీక్ష బ్రహ్మాండంగా రాస్తాను. చూడమ్మా!... మా అమ్మే! మా అమ్మ బంగారు కొండంట! సాయంకాలం మా ఫ్రెండ్స్ అందరికీ టిఫిన్ చేసి పెడ్తుందంట!... ఏమ్మా!... చెప్పమ్మా" మూలుగును తోడు చేసి అడుగుతూ లెఫ్ట్ రైట్ అడుగు కదుతున్నాడు నారాయణ.

"అలాగేలే నాయనా!' అనిందా తల్లి- ఇద్దరు ఆడపిల్లల తర్వాత కలిగిన మగ నలుసు కాబట్టి.

ఆ మాట చెవిని పడడంతో నారాయణ మొగంలో పువ్వులు పూశాయి. వాటిని ముద్దులుగా మార్చి తల్లి కందించి వెళ్ళి పుస్తకాల ముందు కూర్చున్నాడు.

నిజంగానే నారాయణ ఆ పూట పరీక్ష అద్భుతంగా రాశాడు.

అంతే! ఆ పూట బడినుండి వచ్చి రావడంతోటే అవ్వమ్మ పాదాలమీద సాష్టాంగ పడ్డాడు మనఁవడు. దినమూ ఏదో ఒక చిలిపి చేష్టలో ఆటపట్టించే మనఁవడు అమాంతంగా పాద నమస్కారం చేయడంతో అవ్వమ్మ ఆనందం ఆ ఇల్లే పట్టలేదు. ఆశీః ప్రవాహం ఆ తరువాత ఒకటి రెండు రోజులకు కానీ ఆగలేదు.

అడిగీ అడగడంతోటే అయ్యా అయిదు రూపాయలివ్వడం... అమ్మ తనకు తన మిత్రులందరికీ కమ్మని టిఫిన్ చేసి పెట్టడం...తాను పరీక్ష బ్రహ్మాండంగా రాయడం...ఊళ్ళో కొచ్చిన కొత్త సినిమాను మొదటి రోజున్నే మొదటి ఆట చూడడం– అంతా కాకమ్మ మొగం చూసిన చలవే! అన్న నమ్మకం ఆ లేత గుండెల్లో బాగా నాటుకొనింది!

అందుకే నారాయణ ఆనాటి నుండి ఈనాటి వరకు కండ్లు నులుముకొంటూ నిద్రలేచి కండ్లు తెరుస్తూనే కాకమ్మ మొగం చూస్తున్నాడు.

నారాయణ బియ్యే మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడైన తర్వాత నాలుగైదేండ్లు జీవనోపాధి కల్పించే కార్యాలయంచుట్టూ పట్టువిడువని విక్రమార్కుడిలా తిరిగాడు. తిరిగాడు తనఇంటినుండి ఆ కార్యాలయంవరకు ఉన్నదారి తాను నడిచి నడిచే బాగుపడిందన్న నమ్మకం తనకుకాదు– ఆ కార్యాలయాధికారులకు కలిగిన పిమ్మట అతనికి భూసార సంరక్షణ శాఖలో ఉద్యోగం దొరిగింది. ఉద్యోగం వచ్చీరావడంతోటే ఎదురుచూడని అందాలరాశి ఎదురై 'అర్ధ శరీరం నాది!' అన్న హఠంతో నారాయణ జీవితంలో బైఠాయించింది. ఆమె గడపలో కాలూనిన ఏడాదికే ఇంటిగోడల చెవులు జోలపాటల్ని ఆనందంగా ఆస్వాదిస్తున్నాయి!

'ఇదంతా కాకమ్మ మొగం చూసిన చలవే!' అని నారాయణ నమ్మకం.

తనకు జరిగిన ఇంత మంచిని చూసి ఆనందించడానికి అవ్వమ్మ ఈనాడు లేదు. మునిమనుమడి ముద్దుల రుచి చవి చూసే అదృష్టానికి ఆ ముసల్ది నోచుకోలేదు. ఉన్నట్లుండి ఒకనాడు చెప్పకుండా చెందకుండా గుట్టెక్కిపోయింది.

ఆ రోజు నారాయణ కంటికి కడవడుగా ఏడ్చాడు.

అయితే పెద్ద కర్మ రోజు ఎవరు పెట్టినా కూడుముట్టని కాకమ్మ తాను పెట్టేసరికి తనివిదీర తినింది. తింటూ తింటూ నారాయణ వైపు ఎంతో ప్రేమగా చూసింది. అది చూసేసరికి నారాయణ కన్నులు చెమ్మగిల్లాయి. అవ్వమ్మను కాకమ్మలో ఊహించుకొని నారాయణ చేతులెత్తి నమస్కరించాడు కూడా!–

ఆరోజునుండి నారాయణనమ్మకం మరీ బలపడిపోయింది.

నారాయణ ఆఫీసుకు బయల్దేర్తాడు. బయల్దేరిన వేళా విశేషమేమో మరి?– ఒక్కొక్కరోజు వరసగా వంద కాకులు కంట పడ్తాయి. కంటపడిన ప్రతి కాకమ్మకూ తన భక్తిప్రపత్తులు చాటుకొంటూ సావధానంగా వెళ్ళేసరికి ఆలస్యం అవుతుంది.

ఆఫీసుకు ఆలస్యంగా వెళ్తే చీవాట్లు తప్పవు. ఆ చీవాట్లయినా వంచిన తలెత్తకుండా భరించగలడు కానీ నారాయణ కంట పడిన కాకమ్మను మాత్రం నిర్లక్ష్యం చేసి ముందుకు పోలేడు.

ఎలాపోతాడు? కాకమ్మ తనజీవితాన్నే ఒక మలుపు తిప్పింది గదామరి?

అయితే ఆరోజు–

నిద్రలేస్తూనే కాకమ్మమొగం చూసికూడా ఉద్యోగం ఊడిపోయింది! నారాయణ కాకి శోకంగా విలపించాడు. ఈ నిరుద్యోగ పర్వాన్ని నిర్వహించడమెలా? అని ఆలోచనలో పడ్డాడు. ఇక కాకి మొగమే చూడదనుకొంటూనే మళ్ళీ అలవాటు మేరకు నిద్రలేస్తూనే కాకమ్మ మొగం చూస్తున్నాడు.

అయినా నిరుద్యోగపర్వంలో ఎన్ని వ్యాసఘట్టాలో?

నిద్రలేస్తూనే పసివాడి పాల కొరక ఘట్టం. కాఫీ నీళ్ళకొరక ఘట్టం. పది గంటలైతే మార్కెట్టుకు వెళ్ళడం ఒక ఘట్టం. మధ్యాహ్నమైతే ఎసట్లోకన్ని బియ్యానికొక ఘట్టం. ఆ పూట ఎలానో ఒకవిధంగా గడిచిందనుకొంటే– ఆ మరుసటి రోజు గడవడం? ఎవరి మీదనోపడి అప్పు పుట్టించుకోవడమొక ఘట్టం!– ఈ ఘట్టాలన్నీ దాటాలంటే సాక్షాత్ ఆ వినాయకుడే దిగి వచ్చినంత పని అవుతూ ఉంది!–

వినాయకుడు దిగి రాలేదు... తానూ ఈ ఘట్టాల్ని దాటలేదు. నారాయణకు ఈ సంగతి బాగా తెలుసు. అందుకే ఏనాడో ఒకనాడు రాత్రికి రాత్రే ఊరు దాటి పోవాలనుకొంటాడు. తండ్రి దగ్గరికి వెళ్ళిపోతే ఈ బాధలు కొంతవరకు తగ్గుతాయని భ్రమపడ్డాడు.

అయితే అక్కడ తండ్రిమాత్రం సుఖడోలికల్లో ఊరేగుతున్నాడా? లేదే?

తాను బియ్యే వరకు వెలిగించి గుమాస్తాగిరి సాధిస్తే ఆయన మెట్రిక్యులేషన్ చదువుతోనే గుమాస్తా అయ్యాడు. అందరి తల్లో నాలుకనిపించుకొంటూ వంచిన తలెత్తకుండా రెండు దశాబ్దాలకు పైబడి పనిచేస్తే ఆయన హెడ్ గుమాస్తా అనిపించుకొనేసరికి హెడ్ పండిపోయింది. ముప్పుతిప్పలు పడి నలుగురు కూతుర్లలో ముగ్గుర్ని గడపదాటించేసరికి పండిన తల మరీ పండి వంగిన నడుము మరీ వంగిపోయింది. ఆయన పంచన చేర్తే?– వెళ్ళితే ఒక సమస్య. వెళ్ళకపోతే ఆఊళ్ళో దినగండం నూరేండ్లుగా బతుకు గడపడం ఒక పెద్ద సమస్య. ఇక ఏం చెయ్యాలో అని ఆలోచిస్తున్న తరుణంలో నారాయణ చెవిని పడింది పిడుగులాంటి వార్త!

కొత్తగా గద్దెఎక్కిన ప్రభుత్వం తానుప్రారంభించిన పొదుపు ఉద్యమంలో భాగంగా ప్రభుత్వోద్యోగుల వయోపరిమితిని యాభై అయిదేండ్లకే పరిమితం చేసింది. ఈ దెబ్బతో తన తండ్రి ఉద్యోగానికి ఉద్వాసన మరో మూడేండ్లు ముందుకొచ్చింది.

గోరు చుట్టుపై రోకటి పోటు!

ఏది దారి? ఇంకేది దారి? అని ప్రతిరోజు ఆలోచిస్తున్నట్లే ఆ రోజుకూడా ఆలోచిస్తూంటే పొద్దు గూట్లోపడింది.

రెండేండ్ల అడ్డబాలబిడ్డ ఆకలికి ఏడ్చి ఏడ్చి అలానే సొమ్మసిల్లి పడుకొన్నాడు. వాడి ఆకలిని తీర్చడానికి తల్లి దగ్గర పాలు లేవు. కొని తేవడానికి చేతిలో పైసల్లేవు. తన ఉద్యోగమే కాకుండా తండ్రి ఉద్యోగం కూడా పోతుందనుకొంటూ పొగులుతున్న భర్తను పలకరించడానికి కూడా ఆ ఇల్లాలికి ధైర్యం చాలడంలేదు. కొడుకు పక్కన కూర్చొని గోడకు చేరగిలపడిఉంటే ఆమె కండ్లల్లో నీళ్ళు కాల్వలు కట్టాయి. ఏడుస్తూ ఏడుస్తూ ఏప్పుడో ఆమె ఒళ్ళు మరిచింది.

ఆ రాత్రి నారాయణ కంటిమీద రెప్పపడలేదు. కంటిమీద రెప్ప పడలేదని కాలం ఆగలేదు. ఆగని కాలంతో కలిసి ఆలోచనలు పగ్గాల్లేని గొడ్డుల్లాగ పరుగులు తీస్తున్నాయి.

తూర్పున పటమెరిగింది!

నారాయణ కుటుంబాల్లాంటి కుటుంబాలెన్నో ఈ దేశంలో కలగలిసి కుమిలి ఏడుస్తుంటే ఎర్రబారిన కండ్లల్లోని ఎరుపు రంగును తాత్కాలికంగా అరువు దెచ్చుకొన్న తూర్పు దిక్కు అరుణ కాంతులతో అలరారుతూ ఉంది.

చెట్ల మీద కాకులు గోలచేస్తున్నాయి!

కాకమ్మ అరుపు చెవిని పడేసరికి ఎగిరిపడి లేచాడు నారాయణ!

కండ్లు నులుముకొంటూ లేచి కండ్లు తెరుస్తూనే కాకమ్మ మొగమే చూశాడు. చూస్తూ ఈ దినగండం గట్టెక్కించు తల్లీ! అని నమస్కరిస్తూంటే 'టెలిగ్రాం సార్!' అన్న పిలువు చెవిని పడింది. గబగబవెళ్ళి వాకిలి తలుపుతీసి టెలిగ్రాం సందేహిస్తూ చేతికందుకొన్నాడు. ఆ టెలిగ్రాం చదువుకొంటూ తిరిగివచ్చి లేచినచోటనే కూలపడ్డాడు!

"ఏ౦వండీ? ఏ౦వయిందండీ?... ఎక్కడినుండండీ టెలిగ్రాం?" అంటూ నారాయణ సతీమణి నాగమణి ఎదురుగా నిలబడి అడుగుతూ ఉంది.

ఒక్కసారి నారాయణ తలెత్తి ఆమె మొగంలోనికి చూశాడు. ఆమెను చూస్తుంటే అతని కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. గభాలున రెండు అరచేతుల్తో మొగాన్ని కప్పుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు.

నాగమణి ఇంచుమించు అదే స్థితిలో టెలిగ్రాం చేతికందుకొనింది.

"ఓరి భగవంతుడా? ఎందుకయ్యా మామీద నీకింత కసి? ఉన్నోళ్ళను వొదిలిపెట్టి మాలాంటి బతుకుల్తో చెలగాటాలాడ్తున్నావే? - లేకుంటే ఈ వయస్సులో మాఁవగారికి హార్ట్ అటాక్కా? ఉన్న ఏడుపులకు ఇంకొక ఏడుపు తోడా? భగవాన్! ఈ చిత్రహింస పెట్టేదానికన్నా మా ముగ్గుర్నీ ఒక్కసారిగా..."

"మణీ!" గద్గద స్వరంతో అరిచాడు నారాయణ.

"ఏ౦వండీ?...లేకుంటే ఎందుకండీ ఈ పాడు బతుకులు? మనల్ని మనం ఉద్ధరించుకోలేం. ఇంకొకర్ని ఉద్ధరించలేం!"

"నిజమేననుకో! కష్టాలు మనుషులకు రాకుండా మాకులకా వస్తాయి? పరిస్థితిని తట్టుకొని నిలబడాలేకానీ!"... తనమాటలు తనకేఎబ్బెట్టుగా వినిపిస్తుంటే పాపం! నారాయణ మాటల్ని పొడిగించలేక నోరు మూసుకొన్నాడు.

నాగమణి కండ్లు వాగులై వరదలు కట్టడానికి సిద్ధపడ్తున్నాయ్!

"ఏ౦వండీ? ఎకాఎకిని ఎలబారి పోవాల్సిందే గదండీ?... ఇప్పుడేం చెయ్యాలి? అయినా ఈ మాయదారి గుండెజబ్బు ఆయనకే రావాలా?"

"అవును మణీ! ఆయనకు రాకుండా ఇంకెవురి కొస్తుంది చెప్పు?– నానా అవస్థలు పడి నన్ను చదివించాడు. ముగ్గురి కూతుళ్ళకు పెండ్లిండ్లు చేయించాడు. ఇంకొక్క అమ్మాయి ఉంది. ఇంకొక మూడేండ్లు సర్వీసు ఉంది. ఈ మూడేండ్లలో దానికలా మూడుముళ్ళేసి ఎలాగో చేసిన బాకీలు తీర్చుకొందాం అనుకొన్నాడు. ఇంతలోనే ఈ ప్రభుత్వం పుణ్యం కట్టుకొనింది. ఆ షాక్ నుండి తట్టుకొని నిలబడాలంటే ఆయన నానా గడ్డికరిచి నాలుగు చేతుల్తో సంపాదించి అయినా ఉండాలి. లేకుంటే తాత ముత్తాతలు సంపాదించి పెట్టిన తరగని ఆస్తి అయినా ఉండాలి. అదీలేదు. ఇదీలేదు. ఏంవీ లేని బతుకుల్లో ఏంవవుతుంది. చెప్పు?"

బాబు గుక్క పట్టి ఏడుస్తున్నాడు.

బదులు చెప్పే ఓపిక లేక... ప్రభుత్వాన్ని నిందించే శక్తి అసలే లేక... ఆమె చేయగలిగిన ఒక్క పని చేయడానికి ఉపక్రమించింది. అది బాబును సముదాయించడం. లాలింపులకు బేలింపులకు ఆకలి లొంగిపోయేటట్టుగా ఉంటే ఇంకేముంది?

ఏమి చేయాలో తోచక ఆ ఇల్లాలు విసుక్కొంటూ ఉంది.

నారాయణ దండెం మీద షర్టు తీసి వేసుకొని బయటికి నడిచాడు.

ఆవీధి చివర్న ఒక టీఅంగడి! ఆ అంగడి ముందుకూర్చొని చూస్తే అక్కడి నుండి మూడు దిక్కులకు మూడు రోడ్లు బయలుదేరినట్లుంటుంది. అందుకే ఆ మూడు వీధుల్లోని కాఫీగత ప్రాణులు ఆ అంగడి ముందర అయిదు గంటలకే హాజరవుతారు.

ఆ అంగడి ముందు వేసిన బెంచీలమీద తీరిగ్గా కూర్చుని అర్ధరూపాయి సింగిల్ కాఫీని దర్జాగా సిప్‌చేస్తూ సిగరెట్టు కాలుస్తూ రూపాయి దినపత్రికల్ని అటునుంటిఇటు, ఇటునుండి అటు తిరగేస్తుంటారు.

నారాయణ టీ అంగడి ముందు నిలబడ్డాడు. ఎవరికేమి కావాలో టీ అంగడివాడికి ఎరుకే!– నారాయణ టీ అందుకొన్నాడు. అందుకొన్న వేడివేడి టీని అర్చిఅర్చి తాగుతున్నా తన తల నిండుకు ఆలోచనలే!

తండ్రి హాస్పిటల్లో ఉన్నాడు. అమ్మ ఒక అమాయకురాలు. సుఖాల్లో పొంగి పోవడం. కష్టాల్లో కుంగిపోవడమే ఆమె తత్త్వం. తోడుకు చెల్లెలొకటి. అది అంతకంటే అమాయకురాలు. ఆ గుండె జబ్బు మనిషిని హాస్పిటల్లో చేర్పించి ఎన్నెన్ని తిప్పలు పడుతున్నారో?–

ఆలోచించే కొద్దీ నారాయణ మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది. వెంటనే బయల్దేరమని మనస్సు తొందరపెడ్తూ ఉంది. బయల్దేరాలంటే బయలుదేరవచ్చు. కానీ కావలసింది డబ్బు! అదే లేదు. అయితే ఏం చెయ్యాలి? అని ఆలోచిస్తూ ఉంటే నారాయణ మనస్సులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది.

ఏది ఏమైనా సరే!– అదొక్కటే మార్గం. అయితే గుండె గుభిక్కు మనింది. అయినా తప్పదు!...

నారాయణ తన నిర్ణయంతో తాను మల్లగుల్లాలు పడ్తుంటే టీ అంగడి మనిషి అర్థరూపాయి వాపసు ఇచ్చాడు. ఆ పైసల్ని అలానే చేతిలో పట్టుకొని నారాయణ అంగడి వాని వైపు తదేకంగా చూస్తున్నాడు. ఆ చూపుల్తో అంగడి వానికి సందేహం కలిగింది. అందుకే–

"ఏందుకలా చూస్తున్నావే?" అని అడిగాడు.

"మిగతా చిల్లర?"

"ఎంత నువ్విచ్చింది?"

"రెండు రూపాయలు?"

"బలే బాగుందయ్యా యవ్వారం! రూపాయిచ్చి రెండ్రూపాయలంటున్నావే?"

"నిద్రలేచి నోట్లో సరిగ్గానీళ్ళుకూడా పొయ్‌లేదు. నీతో అపద్ధం చెప్తున్నానంటావా?"

"అయితే నేను చెప్తున్నానంటావా?"

"నువ్వు చెప్తున్నావని నేను చెప్పడంలేదు!– ఒక్కసారి బాగా గుర్తుకు తెచ్చుకోమంటున్నా!– నే నిచ్చింది రెండు రూపాయలే!"

"ఏందయ్యా గుర్తుకు తెచ్చుకుండేది?... నువ్విచ్చిన్నోటు!... ఎట్లుణ్ణో సూళ్ళా? నల్లగా మసిబారి నలిగి పొయ్యుండె గదయ్యా?– తాకితే సినిగి పొయ్యేటట్టుంటే బాగా సూసే గదా నేను లోపలేసుకుణ్ణింది"

"ఈ డబ్బు సాక్షిగా చెప్తున్నా! నేనిచ్చింది మాత్రం రెండురూపాయలే! నువ్వు నమ్మితే నమ్ము. నమ్మకపోతే పో!" చేతిలో డబ్బుల్ని చూపిస్తూ సత్యం చేశాడు నారాయణ.

"సీసీ యదవ డబ్బు! రూపాయి కోసరం సత్తిం చేస్తాడా? రెండురూపాయలే ఇచ్చుంటాడు. ఈ తొందర్లో నువ్వు మర్సిపొయ్యుండొచ్చుగదా?"

"అపద్ధం చెప్పాలనుకుంటే రెండు రూపాయలనే ఎందుకు చెప్పాలి?"

"అయిదో పదో ఇచ్చినట్లు చెప్పచ్చుగదా?"

టీ అంగడి ముందు లోకులు తమ లోకజ్ఞతను ప్రకటించుకొన్నారు.

అంగడతనికి అరికాలి మంటనెత్తికెక్కింది!

"ఇద్దో ఈ అమృతం సాచ్చిగా!"... అనబోతుంటే అతని పక్కన్నే నిలబడుకొన్న అతని అర్ధాంగి గబుక్కున ఒక చేత్తో నోరు మూసి ఇంకొక చేత్తో రూపాయనోటెత్తి నారాయణ చేతికిచ్చింది"

"మంచి పన్జేసినావమ్మా! యదవ రూపాయ కేంది సత్తేలు బాసాలు!... దీంతో కొంపలు మునిగిపొబొయ్యేదీలే! మిగిలి మిట్టన పడబొయ్యేదీలే!"

కర్మసిద్ధాంతంలోని మర్మాన్ని కమ్మగా వినిపించాయి కొన్ని గొంతులు.

ఆ పక్కనే చెట్ల మీది కాకులు 'కార్ కార్' మని అరిచాయి.

నారాయణ ఒక్కసారి చెట్టువైపు చూసి కాకమ్మకు మనస్సులోనే నమస్కరించుకొని గిరక్కున వెనక్కు తిరిగి వంచిన తలెత్తకుండా ముందుకు నడిచాడు. అయిదో నిమిషానికి ఇంట్లో అడుగుపెడ్తూ, 'మణీ' అని పిలిచాడు. ఏడుస్తున్న బాబును ఏదో విధంగా సముదాయించాలని ప్రయత్నిస్తున్న ఆ యిల్లాలు 'ఏఁవండీ?' అంటూ వచ్చి ఎదుట నిలబడింది.

"ఇద్దో ఈ రూపాయి తీసుకో!"

"తెల్లార్తాళకే ఖర్మ!.... ఎవరి ముందు చెయ్యి చాపినారండీ?"

"చెయ్యే చాపానో! జేబే కొట్టానో? నీకెందుకదంతా?...వెళ్ళు. వెళ్ళి కాసిన్ని పాలుదెచ్చి ఆ బిడ్డకు తాగించు"

ఆ ఇల్లాలు భర్త అకారణ కోపానికి ఒక్క క్షణం అవాక్కయింది. అంతలోనే సర్దుకొని పాలచెంబు చేతికందు కొనింది. మారుమాట్లాడకుండా బయటికి నడిచింది.

ఆమె ఇంటి గడప దాటిందో? లేదో? నారాయణ రెండు చేతులతో ముఖాన్ని కప్పుకొని ఎంత నీచస్థితికి దిగజారుస్తున్నావురా భగవంతుడా! అని 'బొరో'మన్నాడు.

గంట తొమ్మిదయింది.

తూర్పుదిశలో కర్మ సాక్షి కన్నెర్ర చేస్తున్నాడు.

బుజ్జోడు కడుపార పాలు తాగి బజ్జున్నాడు.

పేగుతెంచుకొని పుట్టినబిడ్డ పేగులు ఏదో ఒకవిధంగా చల్లబడితే కన్నపేగు కండ్లల్లో తృప్తి తొణికిసలాడుతూ ఉంది.

గోడకు చేరగిలపడి ఆలోచనల్తో సతమతమవుతున్న నారాయణ కలగని మేల్కొన్నట్లు ఎగిరిపడి పైకిలేచాడు. టెలిగ్రాం కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకొన్నాడు. 'మణీ! ఇప్పుడే వస్తా!' అంటూ ఒక్క ఊపులో బయటపడ్డాడు.

ఎంతో ధీమాగా బయలుదేరాడే కానీ నారాయణకు లోబిరికి వెలిబిరికిగానే ఉంది. తన ఆలోచనా పర్యవసానం ఏ పరిస్థితులకు దారితీస్తుందో? అని తటపటాయిస్తూనే ముందుకు నడుస్తున్నాడు.

కరెంటు స్తంభం మీది కాకి 'కార్ కార్' మని అరిచింది.

నారాయణ ఒక్క క్షణం నిలబడ్డాడు. కరెంటు స్తంభం మీది కాకి వైపు చూశాడు. కుడిచేతి మునివేళ్ళని ముద్దుగా చెంపలకు తాటించుకొన్నాడు. మనస్సులోనే నమస్కరించుకొని రెట్టించిన ధీమాతో ముందుకు నడుస్తున్నాడు.

అది ఒక సుమారుపాటి పట్టణం.

ఆపట్టణానికది పెద్దబజారు. ఆ పెద్దబజారుకంతా అదొక పెద్దఅంగడి. ఆ అంగడి ముందు ఎప్పుడూ ఒక చిన్నసైజు సంత జరిగినట్లుంది.

ఆ అంగడి ముందు నిలబడ్డాడు నారాయణ!

మనస్సు 'తప్పు' అని వెనక్కు లాగుతూ ఉంది. పరిస్థితులు తప్పదని ముందుకు నెట్టుతున్నాయి. ఈ వైరుధ్య భావంలోనుండి బయటపడడానికి రెండు నిముషాలు!

నిండా మునిగిన వానికి సముద్రం మోకాటి లోతు!!

నారాయణ ఒక్క క్షణం ఆలస్యం చెయ్యలేదు. గబగబ జనాన్ని చీల్చుకొంటూ లోనికి వెళ్ళాడు. 'ఏఁవండీ! మిమ్మల్నే!...ప్లీజ్!...చాలా అర్జంటండీ!... గ్లూకోజ్ బిగ్‌సైజ్ ప్యాకెట్టు ఒకటి...ఫ్యామిలీ సైజ్ ఓవల్‌టిన్ డబ్బా ఒకటి...ఇచ్చేస్తే నేవెళ్తానండీ!' ఎవరో వెంటబడి తరుముతున్నట్లు ఆతురత ప్రకటించాడు నారాయణ.

అతడడిగిన వస్తువులు రెండు క్షణాలమీద కౌంటర్ చేరుకొన్నాయి. బిల్లువేసే వ్యక్తి బిల్లువేసి ఆ బిల్లును శెట్టిగారికి అందించాడు. అప్పటికే నారాయణ అక్కడ తయారుగా నిలబడి ఉన్నాడు.

"ఈ బిల్లెవర్ది?.... ఊఁ! డబ్బివ్వండి!"– తనముందు చేరిన రద్దీని తెమల్చాలన్న అభిప్రాయంతో శెట్టిగారు హడావిడి పడ్తున్నాడు.

'ఇప్పుడే ఇచ్చాను గదండీ!' నింపాదిగా అన్నాడు నారాయణ.

'ఈ బిల్లు తాలూకు డబ్బిచ్చినారా? స్వాధీనంలో ఉండే మాట్లాడుతున్నారా!'

అగ్గి మీద గుగ్గిలమయ్యాడు శెట్టిగారు!

"ఏఁవండీ మాటలు కాస్త జాగ్రత్తగా రానీయండి. స్వాధీనం లేకుండా నేను మీ అంగడికి రాలేదు. స్వాధీనంలేకుండా మీవద్ద నేను వందరూపాయల నోటివ్వలేదు. స్వాధీనానికొచ్చి గుర్తు చేసుకోవాల్సింది మీరే!... ఆఁ!!"

మెత్త మెత్తగానే దబాయించాడు నారాయణ!

"వందరూపాయలా?"

"అబ్బే! కాదు కాదండీ! ఒక్క రూపాయి నోటు!!– ఇది రామరాజ్యం– ఈ రాజ్యంలో ఒక్క రూపాయి నోటిస్తే ఇద్దో ఈ సామాన్లన్నీ వచ్చేస్తాయి!! వేళాకోళానికి కూడా వేళాపాళా ఉండాలయ్యా!"

'అదే నేనూ అంటా ఉండేది!'

ఒకరికి మించి ఒకరు రెచ్చిపోతుంటే మూడో మనిషి తల దూర్చడం తప్పదు.

అందుకే–

"ఎందుకండీ అలా రెచ్చిపోతారు? సావకాశంగా గుర్తుతెచ్చుకోండి. పొరపాటు ఇరు పక్షాలకు సంబంధించింది కదండీ!"

"మొగుడు చచ్చి మొత్తుకుంటూ ఉంటే ఎవడో రాళ్ళు వేసినట్లుంది సార్ వ్యవహారం!– నిద్రలేచి ఎవరి మొకం చూసినానో ఏమో? నాకర్మకొద్దీ ఈ టెలిగ్రాం చూడండి సార్!– మానాన్నకు హార్ట్ అటాక్కట!– నాదగ్గర అంతంత మాత్రంగా ఉంటే పక్కింట్లో అప్పు తెచ్చుకొన్నానండీ?"

ఆ మాట అంటూంటే నారాయణ గొంతు బొంగురు పోయింది.

అక్కడ చేరిన వాళ్ళందరి దృష్టి నారాయణ వైపు మళ్ళింది. అది గమనించాడు నారాయణ.

'చూడండి! మీరే చూడండి. ఈ టెలిగ్రాం చూడండి. ఈ పరిస్థితుల్లో అఫ్టరాల్ వంద రూపాయల కోసం అబద్ధం చెప్తానండీ!'

శెట్టిగారి తల దిమ్మెక్కడంతో రెండుచేతుల్తో తలపట్టుకొని ఆలోచిస్తున్నాడు. అదీ ఒక కంట గమనించాడు నారాయణ.

'ఈ ప్రభుత్వం కట్టుకొన్న పుణ్యమండీ ఇది!.. గవర్నమెంటు సర్వీసును యాభై అయిదేండ్లకే పరిమితం చేశారా? ఆ మాట చెవిన పడేసరికి షాక్!"

నారాయం కండ్లల్లో నీళ్ళు చెంపలమీద జారి బొట్టు బొట్లుగా కింద పడ్తున్నాయి.

"ఏంవి గవర్నమెంటో పాడు గవర్నమెంటు!- ఉండేదంతా ఉండగా ఉద్యోగస్థులమీదే పడింది. ఇట్లా ఎంతమంది నిలవన కూలిపొయ్‌నారో కుమిలి పొయ్‌నారో! ఏంవో పాపం! వీళ్ళందరి ఉసురు కొట్టకుండా పోతిందా?"

"ఇట్లాగదండీ తగిలిన కాలికే తగలడంవంటే!- అక్కడేంవో తండ్రి గుండె జబ్బుతో గింజుకుంటూ ఉంటే ఇక్కడ ఈ గుంజులాట! బాగుండ్లా?"

అక్కడ చేరిన జనం తల కొక్క తీరుగా సానుభూతి ప్రకటిస్తున్నారు.

నారాయణ కాస్త ధైర్యాన్ని పుంజుకొన్నా నీళ్ళు నములుతూ కన్నీరు కారుస్తున్నాడు.

"అయ్యా! శెట్టిగారు! ఎందుకు దీనికింతగా ఆలోచిస్తున్నారు! మీ స్థోమతుకిదెంత?- కాకికి కాకరించి ఉమ్మినంత!'- అతన్ని చూస్తుంటే బాగా చదువుకొన్నవాడుగా కనిపిస్తున్నాడు. పైగా ఇబ్బందుల్లో ఉన్నాడు!"...

"అదిగాదండీ నేననేది..."

"అదిగాదు. ఇది గాదనే మాటల్ని వొదిలి పెట్టండి. కష్టంలో ఉన్న ఒకవ్యక్తి మీ దగ్గరికి డొనేషన్‌కే వచ్చినాడనుకోండి!"

"అది వేరేవిషయం"

"అదే ఇదనుకోండి. అంగడి ముందర అనవసరమైన రచ్చ. అక్కడ పారేసి పొమ్మనండి!"- ఒక సహృదయుడు చొరవ చేసుకొన్నాడు.

శెట్టిగారు మారు మాట్లాడకుండా మిగతా చిల్లర్ని... సామాన్లని విసిరి పారేసినట్లు పక్కకు నెట్టి 'ఊఁ తీసుకోండి!' అన్నాడు.

ఆ మాటనడమే పదివేలు! అన్నట్లుగా నారాయణ ఆ సామాన్లని. డబ్బుని గబాగబా చేతికందుకొన్నాడు. అందరివైపు కృతజ్ఞతా పూర్వకంగా ఒక్క చూపు చూశాడు. ఆ మీదట వంచిన తలెత్తకుండా ముందుకు నడిచాడు.

* * * *

రాత్రి! -

నల్లని కొండల్ని నుగ్గుగా నలగ్గొట్టి వెదజల్లి నట్లున్న చీకటి! అక్కడ ఇక్కడన్న తారతమ్యం లేకుండా విస్తరిల్లి నారాయణ గుండెల్లో కూడా చోటు చేసుకొనింది. ఆ చీకటిలో రవ్వంత వెలుగు కోసరమన్నట్లుగా ఆరాత్రంతా నారాయణ కన్నులు చించుకొని చూస్తున్నాడు.

అలుపు సొలుపు ఎరక్కుండా ఆ రైలు పరుగులు తీస్తూనే ఉంది!

ఆ రాత్రంతా రైల్లో గడిపి భల్లుమని తెల్లారేసరికి తన ఊళ్ళో దిగాడు నారాయణ. ఆదరా బాదరా బయటపడి రిక్షా ఎక్కి ఇల్లు చేరాడు. ఇంట్లో అడుగు పెట్టూనే ఎదుట పడిన అమ్మను చూసి 'అమ్మా!' అంటూ కుప్పగా కూలిపోయాడు.

తల్లిని చూసి కొడుకు...కొడుకును చూసి తల్లి...తల్లీకొడుకుల్ని చూసి ఇంటి కోడలు...కోడలి చంకబిడ్డ- ఒకర్నిచూసి ఒకరు ఎలుగెత్తి ఏడుస్తున్నారు.

అప్పటికి నారాయణ అక్కలు చెల్లెళ్ళు బావలు చుట్టూచేరారు.

అందరూ కలిసి తల కొక విధంగా సముదాయిస్తూంటే ఏడుపు ఎక్కిళ్ళుగా మారింది. నారాయణ తన్ను తాను నిగ్రహించుకొన్నాడు.

"ఏంటిటమ్మా ఈఘోరం? నేనేపాపం చేశానమ్మా?... కన్నకొడుక్కి కంటిచూపుకూడా లేకుండా చేశారే?...ఎందుకమ్మా ఇంత అన్యాయానికొడిగట్టారు?"

బదులు చెప్పలేక తల్లి కుమిలికుమిలి ఏడుస్తూ ఉంది.

"బావా!...ఆమాట నన్నడుగు బావా!...ఏం చెయ్యమంటావ్ చెప్పు? టెలిగ్రాం ఇచ్చి మూడునాళ్ళయింది!"

"మూన్నాళ్ళయిందా?" అని ఆశ్చర్యంగా అంటూ టెలిగ్రాం కోసం వెదుకుతున్నాడు నారాయణ.

"అప్పటికి ఒక్క రాత్రి ఒక పగలు ఎదురు చూశాం బావా!- ఇరుగు పొరుగు పోరు పడలేక...ఇంట్లోశవాన్ని పెట్టుకొని ఉండలేక"....

"నాకు నిన్న తెల్లవారే అందిందే!' అంటూ టెలిగ్రాంను పరిశీలిస్తున్నాడు నారాయణ. ఆఫీసు అడ్రసుకు ఇచ్చిన కారణంగా అది ఊరంతా సర్వే చేసుకొని వచ్చి చేరేటప్పటికి దినాలు మారాయి.

నారాయణ నిర్విణ్ణుడయ్యాడు.

ఆరోజు నుండి తల్లిని కొడుకు సముదాయిస్తున్నాడు. కొడుకును తల్లి సముదాయిస్తూ ఉంది. వీళ్ళిద్దరూ ఏడుస్తుంటే కోడలు ధైర్యం చెబుతూ ఉంది. ఆ కోడలు కూడా ధైర్యాన్ని కోల్పోతే ఆడబిడ్డలు ఓదారుస్తున్నారు. అయినా ఆ ఇంట్లో నుండి ఏడుపు తెంపులు తెంపులుగా వినిపిస్తూనే ఉంది!...

ఆరోజు పెద్దకర్మ!

పిచ్చయ్య శాస్త్రులు చెప్పినట్లంతా విని వినినట్లంతా చేసి నారాయణ పితృదేవుడికి కర్మక్రియలు నిర్వహించాడు.

ఆ తరువాత కాకికి కూడు పెట్టమన్నాడు శాస్త్రులు.

అరటిఆకులో కూడుపెట్టుకొని ఆ అరటాకును రెండుచేతుల్లో అది జాగ్రత్తగా పట్టుకొని నారాయణ కాకిని వెదుక్కొంటూ బయలుదేరాడు. వెంట ఒక మనిషి చెంబుతో నీళ్ళు తెస్తున్నాడు. నారాయణ నడుస్తూ నడుస్తూ ఉండి ఒకచెట్టుమీద కాకమ్మ తనకంట పడేసరికి నిలబడ్డాడు. వెంటవస్తున్న మనిషి చెంబులోని నీళ్ళు నేలమీద చిలకరించాడు.

ఆ స్థలం పవిత్రమయిందన్నమాట!

నారాయణ అరటాకును ఆపవిత్రస్థలంలో పెట్టాడు.

చెట్టుమీది కాకి ఎగిరివచ్చి ఆకుముందర వాలింది.

నారాయణ చేతులెత్తి నమస్కరించడానికి సిద్ధపడ్తున్నాడు.

అయితే ఆ కాకి అన్నం ముట్టుకుంటే ఒట్టు!- ముట్టలేదు సరిగదా? నారాయణ వైపే తీక్షణంగా చూస్తూ ఉంది.

“ఒరే వెధవా? ఎంతో నీతిగా నిజాయితీగా బతికినన్నాళ్ళు బతికాను. ఎన్ని కష్టాలొచ్చినా ఒకర్ని మోసం చేసికానీ, ఇంకొకరి మనస్సును కష్టపెట్టి కానీ నా జీవితంలో ఎరగను. నా కడుపున పుట్టిన నువ్వు ఇంత దౌష్ట్యానికి పాలుపడ్తే నీ మొకం చూస్తానా? నీ చేతి కూడు ముట్తానా?” అని తండ్రి నిలదీసి అడుగుతున్నట్లుంది.

నారాయణ కంటిమీద రెప్పపడకుండా అలా చూస్తూనే ఉన్నాడు. ఇన్నాళ్ళు తనకంటికి నల్లగా కనిపించిన కాకమ్మ- ఆ రోజు తెల్లగా కనిపిస్తూ ఉంది! ●

ఆంధ్రపత్రిక
(2, నవంబర్ 1984)
దీపావళి కథానికల పోటీలలో ప్రథమ బహుమతి